


ఎంఎల్‌సి సాబ్జీ మృతిపై నిజం తేల్చాలి

ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం

ఇటీవల రోడ్డు ప్రమాదంలో అనూహ్యరీతిలో మృతి చెందిన ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మృతిపై నిజాలు తేల్చాలని గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు కోరారు. శనివారం భీమవరంలో ఆయన యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తితో కలిసి అడిషనల్ ఎస్పీ సుబ్బరాజును కలిసి సాబ్జీ రోడ్డు ప్రమాద కేసు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఐవి మాట్లాడుతూ సాబ్జీ రోడ్డు ప్రమాదంపై తలెత్తిన అనేక అనుమానాలను నివృత్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు. ఈ కేసుపై పోలీస్ శాఖ సమాజానికి వాస్తవాలు తేల్చి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.



తణుకులో వినతిపత్రం తీసుకుంటున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



తాడేపల్లిగూడెంలో వినతిపత్రంలో అంశాలను చదువుతున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

మంత్రుల ఇళ్లను ముట్టడించిన అంగన్వాడీలు

విధుల్లో చేరకపోతే కొత్తవారిని పెట్టుకుంటామంటూ డిప్యూటీ సిఎం కొట్టు వ్యాఖ్యలు

తీవ్రంగా ఖండించిన అంగన్వాడీ, సిఐటియు నేతలు

సమస్యలు పరిష్కరించకుండా సమ్మె విరమించేది లేదని స్పష్టీకరణ

త్వరలోనే అంగన్వాడీల సమస్యలకు పరిష్కారం: మంత్రి కారుమూరి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

'సమ్మె విరమించి విధులకు హాజరుకండి.. లేకపోతే మిమ్మల్ని తొలగించి కొత్తవారిని పెట్టుకుంటాం..' అంటూ డిప్యూటీ సిఎం, రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి కొట్టు సత్యనారాయణ అంగన్వాడీలను హెచ్చరించారు. అంగన్వాడీలు తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ శనివారం స్థానికంగా ఉన్న డిప్యూటీ సిఎం ఇంటిని ముట్టడించారు. ఈ క్రమంలో తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకుండా ప్రభుత్వం మొద్దునిద్ర నటిస్తోందని పలువురు నేతలు విమర్శించారు. ఈ క్రమంలో బయటకు వచ్చిన డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ ఒక్కసారిగా అంగన్వాడీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆపై సిపిఎం, సిఐటియు నేతలు మిమ్మల్ని రెచ్చగొట్టి తన ఇంటి మీదకు పంపారనడంతో అంగన్వాడీలంతా ముక్తకంఠంతో ఖండించారు. తమ జీతాలు పెంచాలని 19 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేస్తుందని విమర్శించారు. బెదిరింపు చర్యలు మానుకోకపోతే రానున్న ఎన్నికల్లో తగు గుణపాఠం చెబుతామని సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు యూన్నీ, కార్యదర్శి హసీనాబేగం, ప్రాజెక్టు అధ్యక్షురాలు స్వరూపారాణి హెచ్చరించారు. మంత్రి కొట్టు సిపిఎం నాయకులను, కార్మిక సంఘాల నేతలను చులకనభావంతో మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ క్రమంలో పోలీసులు సిఐటియు నేతలను అక్కడ నుంచి పక్కకు తీసుకెళ్లారు. సమస్యలు పరిష్కరించకుండా తాము విధుల్లో చేరేది లేదని అంగన్వాడీలు తేల్చిచెప్పడంతో మంత్రి ఇంట్లోకి వెళ్లిపోయారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని నేతలు హెచ్చరించారు. తమ డిమాండ్లన్నీ సంపూర్ణంగా పరిష్కరిస్తేనే సమ్మె విరమించి విధుల్లో చేరుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి కర్రి రామకృష్ణ, అంగన్వాడీ నేతలు ప్రభారాణి, కనకమహాలక్ష్మి, వరలక్ష్మి, ప్రసన్న, గాయత్రి, వీరమ్మ, యడవల్లి వెంకన్న పాల్గొన్నారు.

సిఎం నివాసాన్ని ముట్టడిస్తాం

తణుకు రూరల్: అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకపోతే ముఖ్యమంత్రి నివాసాన్ని ముట్టడిస్తామని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కళ్యాణి, సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, గ్రామీణ మహిళా జిల్లా నాయకులు అడ్డగర్ల అజయకుమారి హెచ్చరించారు. శనివారం మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఇంటిని అంగన్వాడీలు ముట్టడించారు. జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని, రూ.26 వేలు వేతనం ఇవ్వాలని, గ్రాట్యుటీ ఇవ్వాలని, మంత్రి వెంటనే రావాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ క్రమంలో పోలీసులు రంగంలోకి దిగి సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్‌ను బలవంతంగా పోలీస్ జీప్ ఎక్కించుకొని టౌన్ స్టేషన్‌కు తరలించారు. అయినా అంగన్వాడీలు అక్కడే బైఠాయించి మంత్రి వచ్చేవరకు ఆందోళన కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భీమవరం వచ్చిన ముఖ్యమంత్రి కనీసం అంగన్వాడీల సమస్యలపై మాట్లాడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీల అమలు కోసం ఏ పోరాటానికైనా సిద్ధమన్నారు. మంత్రి కారుమూరి ఇంటికి చేరుకోగానే అంగన్వాడీలు ఆయనకు వినతిపత్రం అందజేశారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ 'మీ కోసం ఎక్కడో ఉన్న నేను.. వెంటనే వచ్చాను, మీ సమస్యలు ముఖ్యమంత్రికి తెలియజేశాను' అని తెలిపారు. సమస్యల పరిష్కారం త్వరలోనే జరుగుతుందన్నారు. 'చర్చల్లో నేను కూడా ఉంటున్నాను మీ సమస్యలు వెంటనే పరిష్కారం జరిగేలా కృషి చేస్తాను' అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు వైజ్జి ఉషారాణి, నేతలు పాలా మాధవి, దీపిక రాణి, నాగలక్ష్మి, గంగాభవాని, రాజకుమారి, వసంత, నళినికుమారి, శ్యామల, నాగలక్ష్మి, మునసమ్మ, ధనలక్ష్మి, రజని, లక్ష్మి పాల్గొన్నారు.

మంత్రికి అంగన్వాడీల వినతి

పాలకొల్లు: అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి సిఎం కృషి చేస్తున్నారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. పాలకొల్లు వచ్చిన ఆయనను, చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజును అంగన్వాడీలు కలిసి వినతిపత్రం సమర్పించారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ 'ఎవరో రెచ్చగొట్టడం వల్ల మీరు సమ్మె కొనసాగిస్తున్నారని, జగన్ మీ పట్ల సానుకూలంగా ఉన్నారు' అని వ్యాఖ్యానించారు.

ఉత్సాహం.. ఉత్తేజం

ఘనంగా భీమవరం బాలోత్సవం ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం రూరల్



సాబ్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తూ..

అత్యంత ఉత్సాహపూరితంగా ఉత్తేజభరిత వాతావరణంలో భీమవరం బాలోత్సవం శనివారం ప్రారంభమైంది. రెండు రోజులు జరిగే ఈ బాలోత్సవ ప్రారంభ సభలో ముఖ్యఅతిథిగా పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవి) పాల్గొని మాట్లాడారు. బాలలు సాహిత్యం, కళలు, చరిత్ర తెలుసుకునే విధంగా అవగాహన, ఆసక్తి, ఆలోచన, నైపుణ్యం, సృజనాత్మకత కల్గించేలా బాలోత్సవం నిర్వహించడం అభినందనీయమన్నారు. భీమవరంలో చింతలపాటి బాపిరాజు స్మారకోన్నత పాఠశాలలో శనివారం బాలోత్సవం ప్రారంభ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బాల, బాలికల్లో మంచి ఆలోచనలు కలిగేలా దేశం మంచి కోరే ఆదర్శ, అభ్యుదయవాదులుగా ప్రభావం కల్గిస్తే బాలోత్సవాలు సఫలీకృతమైనట్లేనన్నారు. తల్లిదండ్రులు, సమాజం మెచ్చే విధంగా బాలబాలికలు ఎదగాలన్నారు. నేడు పాలకులు దేశభక్తి అనే దానికి అర్థాలు మార్చేస్తున్నారన్నారు. పలు పాటలు పాడి పిల్లల్లో ఉత్సాహం నింపారు. తొలుత ఇటీవల మరణించిన ప్రజా ఉద్యమకారుడు, ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అడిషనల్ ఎస్‌పి ఎవి.సుబ్బరాజు మాట్లాడుతూ బాలోత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. బాలబాలికల్లో ప్రతిభాపాటవాలను పెంపొందించవచ్చునన్నారు. తాను గతంలో ఏలూరులో నిర్వహించిన బాలోత్సవంలో పాల్గొన్నానని గుర్తు చేసి బాలబాలికలకు శుభాకాంక్షలు తెలిపారు. హేలాపురి బాలోత్సవం కార్యనిర్వాహక కార్యదర్శి జివిఎల్.నరసింహారావు మాట్లాడుతూ ఏలూరులో ప్రతియేటా నిర్వహించే బాలోత్సవంలో వేలాది మంది బాలబాలికలు పాల్గొని కళలు, సాహిత్యంలో ప్రతిభను కనబరిచారన్నారు. డిఇఒ ఆర్‌వి.రమణ మాట్లాడుతూ భీమవరంలో యుటిఎఫ్, అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్రం, వసుధ ఫౌండేషన్ బహుముఖ కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. డిఎన్‌ఆర్ కళాశాల అసోసియేషన్ ఉపాధ్యక్షులు గోకరాజు పాండురంగరాజు, సిహెచ్‌బిఆర్ఎం స్కూల్ కరస్పాండెంట్ కూనపరాజు రామకృష్ణంరాజు మాట్లాడుతూ చారిత్రాత్మకమైన తమ విద్యాసంస్థలో బాలోత్సవం జరగడం తమకు ఆనందంగా ఉందన్నారు. ఎస్‌బిఐ రీజనల్ ఆఫీస్‌కు చెందిన మూర్తి మాట్లాడుతూ బాలల దినోత్సవం నిర్వహించడం సంతోషకరమన్నారు. బాలోత్సవం ప్రారంభం సందర్భంగా ముందుగా జాతీయ జెండాను ఎంఎల్‌సి ఐవి, బాలోత్సవం జెండాను గోకరాజు పాండురంగరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహాకవి గురజాడ రచించిన దేశమును ప్రేమించుమన్నా అనే దేశభక్తి గేయాన్ని చైతన్యప్రసాద్, రంగా తదితరులు ఆలపించారు. అనంతరం శాస్త్రవేత్త, పద్మశ్రీ ఎంఆర్.రాజు బాలోత్సవం ప్రారంభమైందని ప్రకటించడం ద్వారా బాలోత్సవం ప్రారంభమైంది. బాలోత్సవం నిర్వాహక కమిటీ అధ్యక్షుడు ఇందుకూరి ప్రసాదరాజు మాట్లాడారు. భారత అంతరిక్ష పితామహుడు, పద్మవిభూషణ్ విక్రమ్ సారాభాయ్ వర్ధంతి సందర్భంగా సభలో ఆయనకు నివాళులర్పించారు. బాపిరాజు స్మారక పాఠశాల పిఇటి గొట్టుముక్కల చంద్రశేఖర్‌రాజు ఆధ్వర్యంలో రోప్ స్కిప్పింగ్, మార్కంబ్లలో వివిధ విన్యాసాలను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ ఎంఆర్.రాజును ఘనంగా సన్మానించారు. విచిత్ర వేషధారణ, ఏకపాత్రాభినయం, వ్యాసరచన, మెమరీ కాంపిటీషన్, జానపద, శాస్త్రీయ నృత్యాలు, బృంద గీతాలాపన తదితర సాంస్కృతిక కార్యక్రమాలను విద్యార్థులు ప్రదర్శించారు. వసుధ ఫౌండేషన్ కార్యదర్శి మంతెన కృష్ణంరాజు, డిఎన్‌ఆర్ కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు), యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, బాలోత్సవం నిర్వాహక కమిటీ కార్యదర్శి సిహెచ్.పట్టాభిరామయ్య, అసోసియేటెడ్ అధ్యక్షులు గాతల జేమ్స్, చీఫ్ అడ్వయిజర్ చెరుకువాడ రంగసాయి, కోశాధికారి పాకలపాటి సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.



బాలోత్సవ పతాకావిష్కరణ..



గేయాలు ఆలపిస్తున్న బాలికలు

మెడకు ఉరితాళ్లు.. గడ్డి తింటూ..

5వ రోజు వినూత్నంగా మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - భీమవరం రూరల్

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె ఐదో రోజు శనివారం కొనసాగింది. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు మెడకు ఉరితాళ్లు తగిలించుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ జెఎసి నాయకులు ఎస్‌కె.నాగూర్, జి.నాని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేయడం తగదని, వెంటనే మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పోటీ కార్మికులతో పని చేయించాలని ప్రభుత్వం ఆదేశించడం కార్మికుల రెచ్చగొట్టడం కాదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు, నేతలు బి.వరలక్ష్మి, ఎం.ధనలక్ష్మి, ఎన్.విశ్వనాథం, బంగారు దుర్గాప్రసాద్, ఎం.శివ, ఎల్లారమ్మ, పద్మ, నాగమణి, మరియమ్మ పాల్గొన్నారు.



నల్లదుస్తులతో తాడేపల్లిగూడెంలో..



ఉరితాళ్లతో భీమవరంలో..

తణుకు రూరల్: జగన్మోహన్‌రెడ్డి విందు భోజనం చేస్తూ మున్సిపల్ కార్మికులకు గడ్డి పెడుతున్నారంటూ మున్సిపల్ కార్మికులు తమ సమ్మె శిబిరంలో శనివారం గడ్డి తింటూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షుడు కామన మునిస్వామి మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు సమ్మెపై ప్రభుత్వం సరిగ్గా స్పందించకపోవడం దారుణమన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆగదని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నీలాపు ఆదినారాయణబాబు, మజ్జి కృష్ణబాబు, కొడమంచి సుధీర్‌బాబు, వై.రాజు, దేవి, నీలా అనంతలక్ష్మి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మెకు టిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బసవ రామకృష్ణ, బొబ్బల శ్రీనివాస్, మారుతీరావు, మల్లిన రాధాకృష్ణ సంఘీభావం తెలిపారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి విడివాడ రామచంద్రరావు సమ్మెకు సంఘీభావం తెలిపారు.

తాడేపల్లిగూడెం: మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షులు కర్రి నాగేశ్వరరావు స్పష్టం చేశారు. మున్సిపల్ కార్మికులు శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నల్ల దుస్తులు ధరించి ఐదో రోజు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం మొండివైఖరి వీడాలని కోరారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సోమవరపు సతీష్, ధనాల రాజు, అల్లం పూర్ణిమ, తాటికొండ భాను, నీలాపు ధనరాజు, కె.దయామణి తదితరులు నాయకత్వం వహించారు.

టిడిపి సంఘీభావం

మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమ్మెకు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల మల్లికార్జునరావు (బాబ్జి) మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టిడిపి అధికారం చేపట్టిన వెంటనే మున్సిపల కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గొర్రెల శ్రీధర్, పట్టణాధ్యక్షులు పట్నాల రాంపండు, నేతలు పరిమి రవికుమార్, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

పాలకొల్లు: తమ న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వం పరిష్కరించాలని, లేనిపక్షంలో జనవరి 3 నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు పాలకొల్లు మున్సిపల్ పారిశుధ్య కార్మికులు హెచ్చరించారు. శనివారం వారు మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. జగన్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని నినాదాలు చేశారు. ఆందోళనకు ఎఐటియుసి నేత ధనాల శ్రీను నాయకత్వం వహించారు.



గడ్డి తింటూ తణుకులో..

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం



పేదల ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో ఇళ్ల నిర్మాణం పురోగతిపై ఆమె సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్మాణంలో ఉన్న ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణంలో మెరుగైన ఫలితాలు కనబరచాలన్నారు. లేఅవుట్లలో లెవెలింగ్, విద్యుత్, అప్రోచ్ రహదారులు, డ్రెయినేజీ, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాల్లో చొరవ చూపకపోతే అర్హులైన ఇతరులకు అవకాశం కల్పించాలన్నారు. సమావేశంలో ఆర్‌డిఒలు బి.శ్రీనివాసులురాజు, అచ్యుత్ అంబరీష్, డిప్యూటీ ట్రెయినీ కలెక్టర్ కానాల సంగీత్‌మాధుర్, హౌసింగ్ పీడీ డాక్టర్ ఆర్‌సి.ఆనంద్‌కుమార్, డిఇ రమణ, రవికుమార్ పాల్గొన్నారు.

ఇవిఎం గోడౌన్ తనిఖీ

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను కలెక్టర్ ప్రశాంతి శనివారం రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. స్థానిక ఇవిఎం గోడౌన్ వద్ద ఏర్పాట్లు, బందోబస్తు, వెబ్‌కాస్టింగ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోడౌన్ వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ బి.శివన్నారాయణరెడ్డి, ఎన్నికల తహశీల్దార్ వై.దుర్గాకిషోర్, డిప్యూటీ తహశీల్దార్ ఎం.సన్యాసిరావు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు కామన నాగేశ్వరరావు, మరపట్ల శ్యాంబాబు, కోమటి రవికుమార్ పాల్గొన్నారు.

తాగునీటి పథకాలు ప్రారంభం

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలో రూ.15 కోట్ల వ్యయంతో నిర్మించిన రెండు ఓవర్‌హెడ్ ట్యాంకులను, తాగునీటి సరఫరా కేంద్రాన్ని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మరో 30 సంవత్సరాల వరకు పట్టణంలో తాగునీటి సమస్య లేకుండా వైసిపి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపి, నేతలు చెల్లెం ఆనందప్రకాష్, యడ్ల తాతాజీ, నడపన గోవిందరాజులు, గుంటూరు పెద్దిరాజు, అడబాల వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ శేషాద్రి, మున్సిపల్ ఇంజినీర్లు రాజ్‌కుమార్, సాంబశివుడు, సతీష్ పాల్గొన్నారు.



ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి కారుమూరి



మోషేన్‌రాజుకు వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగులు

ఎస్ఎస్ఎ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐవి

శాసనమండలి ఛైర్మన్‌కు వినతి అందించిన ఉద్యోగులు

భీమవరం రూరల్: సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి ప్రభుత్వం సమ్మె విరమింపజేయాలని పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవి) ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమను ప్రభుత్వ ఉద్యోగులు గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎస్ఎ కాంట్రాక్టు ఉద్యోగులు చేపట్టిన సమ్మె శనివారం 11వ రోజుకు చేరుకుంది. సమ్మె శిబిరాన్ని సందర్శించిన ఎంఎల్‌సి ఐవి మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో కాంట్రాక్ట్ ఉద్యోగులు ఎంతో కష్టపడి ఏళ్ల తరబడి పని చేస్తున్నారన్నారు. వీరికి అరకొర జీతాలిచ్చి ప్రభుత్వం పని చేయించుకుంటుందని విమర్శించారు. జగన్ పాదయాత్రలో వీరికి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. అనంతరం ఎస్ఎస్ఎ ఉద్యోగులు శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన స్పందిస్తూ ఎస్ఎస్ఎ ఉద్యోగుల సమస్యలను సిఎం జగన్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో జెఎసి జిల్లా అధ్యక్షులు షేక్ బావాజీ, నేతలు వాసు, సంతోషి, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇంటా.. బయటా సెగలే..!

రెండు జిల్లాల్లోనూ అధికార పక్షమైన వైసిపికి ఇంటా.. బయటా సెగలు తప్పడం లేదు. ఎన్నికలు సమీపించిన వేళ సొంతింట్లో రాజుకుంటున్న అసమ్మతి సెగతో వైసిపి శ్రేణులే ఉలిక్కిపడుతున్నాయి. అదే సమయంలో నాలుగున్నరేళ్ల పాలనపై వివిధ తరగతుల్లో నెలకొన్న అసంతృప్తి ఏస్థాయిలో ఉందో వరుసగా సాగుతున్న అంగన్వాడీ, మున్సిపల్ కార్మికులు, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెతోపాటు ఉద్యోగ, ఉపాధ్యాయులు వివిధ రూపాల్లో చేపడుతున్న ఆందోళనలు చెప్పకనే చెబుతున్నాయి.

మరికొద్ది నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న సమయంలో జిల్లాలో అధికారపక్షం ముప్పేట సమస్యలతో ఉక్కిరిబిక్కిరవుతోంది. ఓపక్క సమస్యలు పరిష్కారం కాక వివిధ తరగతుల ప్రజానీకంలో పెరిగిన అసంతృప్తిని ఎలా చల్లార్చాలో అర్థంకాక మల్లగుల్లాలు పడుతుంటే నియోజకవర్గ ఇన్‌ఛార్జీల మార్పు, సిట్టింగుల తిరుగుబాటుతో పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా తయారైంది. చింతలపూడి ఎంఎల్ఎ ఎలిజాకు టిక్కెట్ ఇవ్వడం లేదనే వార్తలు ఆ నియోజకవర్గంలో నివురుగప్పిన నిప్పులా ఉన్న గ్రూపు విబేధాలను బహిర్గతం చేసింది. అంగన్వాడీలు ఎంఎల్ఎల ముట్టడిలో భాగంగా జంగారెడ్డిగూడెంలో ఎలిజా ఇంటిని ముట్టడించగా 'ఈ సమస్యతో నాకేంటి సంబంధం.. జగన్మోహన్‌రెడ్డికే సంబంధం' అని ఎంఎల్ఎ వ్యాఖ్యానించడం గమనార్హం. ఇక ఎలిజా అనుచరులు వైసిపి రీజియన్ కోఆర్డినేటర్, ఎంపీ మిథున్‌రెడ్డి ఇంటి వద్ద బైఠాయించి ఎలిజాకే టిక్కెట్ ఇవ్వాలని నినదించడంతోపాటు 'జగన్ రావాలి.. ఎలిజా కావాలి' అంటూ ప్లకార్డులు ప్రదర్శించడం చర్చనీయాంశమైంది. మొత్తంగా పరిశీలిస్తే అధికారంలో ఎవరున్నా చింతలపూడి నియోజకవర్గం కొరకరాని కొయ్యగానే మారుతుందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఇక పోలవరం నియోజకవర్గంలో పరిస్థితీ నివురుగప్పిన నిప్పులానే ఉంది. ఆచంట, ఉండి, నరసాపురం, పాలకొల్లు నియోజకవర్గాల్లో ఇన్‌ఛార్జీల మార్పు తథ్యమని ప్రచారం జరుగుతుండటంతో పశ్చిమగోదావరి జిల్లాలోనూ అధికార పక్ష శ్రేణుల్లో గందరగోళం నెలకొంది. ఎన్నికల నేపథ్యంలో ఈ పరిస్థితి నెలకొనడం ఆ పార్టీ నేతలు తీవ్ర కలవరపాటుకు గురవుతున్నారు.

ఇక అంగన్వాడీలు, మున్సిపల్ కార్మికులు, సమగ్రశిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులు సమ్మెలో కొనసాగుతూ వివిధ రూపాల్లో నిరసనలు తెలుపుతున్నారు. అంగన్వాడీల ఆందోళన ప్రభుత్వాన్ని గుక్కతిప్పుకోనీయకుండా చేస్తుంటే మున్సిపల్ కార్మికుల సమ్మెతో పట్టణాల్లో పేరుకుపోతున్న చెత్త పాలకుల వైఫల్యాన్ని ప్రతిబింబిస్తోంది. ఈ క్రమంలో అంగన్వాడీలపై అటు ప్రభుత్వం, ఇటు అధికారులు బెదిరింపుల పర్వానికి దిగుతుండటం చర్చనీయాంశమైంది. అంగన్వాడీల సమస్యలు ప్రభుత్వం పరిష్కరిస్తుందని, కచ్చితంగా ప్రభుత్వం న్యాయం చేస్తుందని పలువురు ఎంఎల్ఎలు, మంత్రులు చెబుతుంటే డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ మాత్రం 'విధుల్లో చేరకపోతే కొత్తవారిని పెట్టుకుంటాం' అంటూ బెదిరింపులకు దిగడం అంగన్వాడీల్లో ఆగ్రహావేశాలను పెంచింది. అటు అంగన్వాడీ లబ్ధిదారుల నుంచి సామాన్య ప్రజల వరకూ అంతా అంగన్వాడీల కోర్కెలు సమంజసమేనని చెబుతుంటే ప్రభుత్వం మొండి వైఖరి అవలంభించడం, ఇచ్చిన హామీని మార్చి చెప్పడం విమర్శలకు తావిస్తోంది.



ఏలూరు కలెక్టర్ రెండు సంవత్సరాల్లోపు చేరిన అంగన్వాడీలు వెంటనే విధుల్లో చేరకపోతే తొలగించాలని నోటీసుల జారీకి సంబంధిత అధికారులకు ఆదేశాలివ్వడంపై నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఇక మున్సిపల్ అధికారులు బలవంతంగా చెత్త సేకరణ ఆటోలను వేరే కార్మికులకు అప్పగించి చెత్తను తరలించేందుకు చేస్తున్న ప్రయత్నాలు అపహాస్యం పాలవుతున్నాయి. ప్రభుత్వపెద్దల ఒత్తిడిని అధిగమించేందుకు అన్నట్లుగా ఒకటి, రెండు చోట్ల చెత్త ఎత్తించి ఫొటోలు తీయించి సమస్యను పరిష్కరించినట్లు చెప్పుకోవడానికే అన్నట్లు పరిస్థితి తయారైంది. ఇక ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ యుటిఎఫ్ ఇప్పటికే దశలవారీ ఆందోళనలకు పిలుపునిచ్చింది. అంటే ఓపక్క ఉద్యోగ, ఉపాధ్యాయులు, మరోపక్క కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు వివిధ రూపాల్లో ఆందోళనలు చేపట్టడం అధికారపక్షానికి ఇబ్బందికరమేనని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఇవి ఇలా ఉంటే ప్రజా సమస్యలు మరోపక్క పెద్దఎత్తున పేరుకుపోయాయి. వెరసి అధికార పక్షమైన వైసిపికి రెండు జిల్లాల్లో ఇంటా, బయటా సెగ తప్పడం లేదని, వీటి నుంచి చాకచాక్యంగా బయటపడకపోతే వచ్చే ఎన్నికల్లో భంగపాటు తప్పదని రాజకీయ పరిశీలకులు ఘంటాపథంగా చెబుతున్నారు.

-వివిఎస్‌వి.ప్రసాద్


మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

ఎన్నికల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం


ఎన్నికల సన్నద్ధత, నిర్వహణలో అప్రమత్తత అవసరమని, పారదర్శకత, జవాబుదారీతనం ముఖ్యమని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి స్పష్టం చేశారు. స్థానిక కలెక్టరేట్ వశిష్ట కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఇఆర్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఎన్నికలకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఓటర్ల సవరణ ప్రక్రియలో భాగంగా క్లెయిమ్స్, అభ్యంతరాలను పరిష్కరించడానికి ఎన్నికల కమిషన్ గడువు పెంచడం జరిగిందని వెల్లడించారు. డిసెంబర్ 26 వరకు ఉన్న గడువును జనవరి 12 వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. ఫైనల్ పబ్లికేషన్ తేదీని కూడా పొడిగించారని, జనవరి 5కు బదులుగా జనవరి 22న ఓటర్ల తుది జాబితా ప్రచురణ ఉంటుందని తెలిపారు. డిసెంబర్ తొమ్మిది తరువాత అందిన ప్రతి క్లెయిమును నిర్ణీత గడువులో పరిష్కరించాలన్నారు.


గ్రీన్ డే వేడుకల్లో విద్యార్థులు

శశిలో గ్రీన్ డే వేడుకలు

ప్రజాశక్తి - ఉండి

ఉండి శశి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో శనివారం గ్రీన్ డే వేడుకలను స్కూల్ కరెస్పాండెంట్ ఇందుకూరి శ్రీనివాసరావు, నాగమణి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతిని ప్రేమించాలని, పచ్చని చెట్టు ప్రగతికి మెట్టు అని అన్నారు. పచ్చని పర్యావరణం పెంచడం వల్ల ప్రకృతిలో సమతుల్యం ఏర్పడి సమయానికి తగ్గట్టు మార్పులు సంభవిస్తున్నాయని వారు తెలిపారు. అనంతరం పచ్చదనం ఆవశ్యకతను తెలియజేసే పలు నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.


ట్యాబ్‌లు అందుకుంటున్న విద్యార్థులు

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి - ఆచంట

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే సిఎం జగన్ లక్ష్యమని మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్ అన్నారు. కొడమంచిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న 62 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.15 వేలు విలువైన ట్యాబ్‌లను శనివారం ఆయన అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో సుంకర సీతారామ్ మాట్లాడుతూ మండలంలో సుమారు 484 మందికి ట్యాబ్‌లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కొడమంచిలి విద్యార్థులకు రూ.9.30 లక్షల విలువైన ట్యాబ్‌లను విద్యార్థులకు అందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో సిఎం జగన్ అనేక పథకాలను ప్రవేశపెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ప్రసాద్, ఎంపిటిసి సభ్యులు యల్లమెల్లి బేబీ రాణి, ఎఎంసి డైరెక్టర్ జక్కంశెట్టి వెంకటేశ్వరరావు, వైసిపి నాయకులు పోలిశెట్టి వనమారాజు, సచివాలయ కార్యదర్శి గోవర్ధన్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆచంట : ఆచంట ఎంవిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎంఎల్‌ఎ శ్రీరంగనాథరాజు ఆదేశాల మేరకు సర్పంచి కోట సరోజినీ వెంకటేశ్వరరావు చేతుల మీదగా ట్యాబులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆచంట గ్రామ అధ్యక్షులు పి.సత్యనారాయణ, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ పువ్వులకాయల జ్యోతి, వైస్ ఛైర్మన్ అరుపల్లి శ్రీను, దేవస్థాన ఛైర్మన్ నెక్కంటి రామలింగేశ్వరరావు, నాయకులు పువ్వులకాయల రామకృష్ణ, బండి మహేష్, గుబ్బల దొరబాబు, ప్రిన్సిపల్ ఎ.షారాణి పాల్గొన్నారు.

రేషన్ డీలర్స్ వైస్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు మృతి

ప్రజాశక్తి - ఆచంట (పెనుమంట్ర)

మార్టేరు గ్రామానికి చెందిన మండల రేషన్ డీలర్స్ వైస్ ప్రెసిడెంట్ సోడగిరి నాగేశ్వరరావు (60) శనివారం ఉదయం ఆయన స్వగృహం వద్ద గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఉదయాన్నే వాకింగ్‌కి వెళ్లి తిరిగి వచ్చిన తర్వాత టిఫిన్ తీసుకున్న కొంతసేపటికి గుండెపోటుకు గురై మృతి చెందారు. ఆయన మృతికి డీలర్స్ మండల అధ్యక్షుడు పితాని సత్యనారాయణ, కార్యదర్శి కుక్కల నాగమణి, తహశీల్దార్ దండు అశోక్‌వర్మ, మార్టేరు సర్పంచి మట్టా కుమారి, ఎంపిటిసి సభ్యులు కర్రి అనురాధ, గుడిమెట్ల లక్ష్మణరెడ్డి, జెడ్‌పిటిసి సభ్యులు కర్రి గౌరీసుభాషిణి, ఎంపిపి కర్రి వెంకటనారాయణరెడ్డి (వాసు రెడ్డి), ఎఎంసి ఛైర్మన్ వెలగల వెంకటరమణ (మిస్సమ్మ) సంతాపం తెలిపారు.

నేరాలు - ఘోరాలు

రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - వీరవాసరం

ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొన్ని ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. భీమవరంలో ఉపాధి నిమిత్తం ఉంటున్న పాటి వెంకట శ్రీనివాసరావు బైక్‌పై తన స్వగ్రామం కంతేరు బయలుదేరాడు. ఈ క్రమంలో వీరవాసరం మండలం పంజావేమవరం వద్దకు వచ్చేసరికి ఎదురుగా వచ్చిన మరో బైకు అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య పార్వతీదేవి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఆస్తి కోసం దాడి

ప్రజాశక్తి - ఉండి

ఆస్తి కోసం సొంత చిన్నాన్న పైనే దాడి చేసిన వ్యక్తిపై ఉండి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఉండి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని యండగండి గ్రామానికి చెందిన పేరిచర్ల సత్యసుబ్బవరహాలరాజుకు అతని అన్న రామభద్రిరాజు కుమారుడు వెంకటపతి రాజుకు కొన్ని సంవత్సరాల నుంచి ఆస్తి తగాదాలు ఉన్నాయి. గతంలో ఉండి పోలీసు స్టేషన్‌లో ఒకరిపై మరొకరు కేసులు నమోదు చేసుకున్నారు. ఈ నెల 14వ తేదీన వెంకటపతిరాజు వరహాలరాజు ఇంటికి వచ్చి తలుపు కొట్టగా తలుపు తీసిన వరహాలరాజుపై వెంకటపతి రాజు తాళం కప్పతో నెత్తిపై బలంగా కొట్టి ధాన్యం సీలు వేసే కర్రతో భుజాల మీద భౌతికంగా దాడి చేశాడు. దెబ్బలు తిన్న వరహాల రాజు చికిత్స చేయించుకుని శనివారం వెంకటపతి రాజుపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉండి ఎఎస్ఐ ఆకురాతి సూర్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బెదిరింపులకు భయపడం


మొగల్తూరులో...

తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శనివారంతో 19వ రోజుకు చేరుకుంది.

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరంలో అంగన్‌వాడీల సమ్మెకు పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలతో ప్రభుత్వం చర్చలు జరిపి సమ్మెను విరమింపచేయాలన్నారు. తెలంగాణ కంటే అదనంగా రూ.వెయ్యి జీతం పెంచుతానని జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీను ఎందుకు నిలబెట్టుకోవట్లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, ఆనాడు యూనియన్ నాయకులు విజయలక్ష్మి, మాధవి కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టణంలో అంగన్‌వాడీల టిడిపి ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షుడు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు చుక్కా సాయిబాబు సంఘీభావం తెలిపారు. అంగన్‌వాడీ ఉద్యోగుల నిరసన ప్రాంగణం వద్ద సాయిబాబు మాట్లాడారు. టిడిపి మాజీ కౌన్సిలర్, ఎస్‌సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎద్దు ఏసుపాదం, టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మైలాబత్తుల ఐజాక్ బాబు, ఎఎంసి మాజీ డైరెక్టర్ కాకర చిట్టిరాజు, పట్టణ ఎస్‌సి సెల్ అధ్యక్షుడు యాళ్ల వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు కొండ్రు శ్రీనివాస్, చల్లబోయిన గోవింద్, మల్లువలస రాము, సతివాడ హరిబాబు పాల్గొన్నారు.

ఆచంట : ఆచంట కచేరి సెంటర్‌లో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శనివారం 19వ రోజులకు చేరుకుంది. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు వివిధ రూపాల్లో తన నిరసన తెలిపారు. సిఐటియు మండల కార్యదర్శి వద్దిపర్తి అంజిబాబు సంఘీభావం తెలిపి మట్లాడారు. అనేక రూపాల్లో అంగన్వాడీలు ఆందోళన చేపట్గినప్పటికీ ప్రభుత్వం సానుకూలత చూపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బాలికలకు, గర్భిణులకు, చిన్నారులకు పౌష్టికాహారని అంగన్‌వాడీ ఏంద్ర అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు మైలే విజయలక్ష్మి, గుత్తుల శ్రీదేవి, మహేశ్వరి, జి. కమల, వెంకటలక్ష్మి, పి.పద్మ, సత్యవతి, గౌరీశ్వరి, నాగలక్ష్మి, సుజాత, వెంకటలక్ష్మి, ఝాన్సీ పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరులో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె 19వ రోజు శనివారం కూడా కొనసాగింది. అంగన్వాడీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దింట్లు, సీత, నాగలక్ష్మి, రేఖ శాంభవి ఉన్నారు.

యలమంచిలి : యలమంచిలిలో అంగన్వాడీలు చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి దేవ సుధాకర్, అంగన్‌వాడీ సంఘ నాయకులు బి.రజిని, పద్మజ, దేవి పాల్గొన్నారు.

ఆచంట (పెనుమంట్ర) : పెనుమంట్ర, ఆలమూరు, మార్టేరు సెక్టార్ నాయకుల ఆధ్వర్యంలో సచివాలయం వద్ద అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కోడే శ్రీనివాస ప్రసాద్, ఆయా సెక్టార్ నాయకులు సాయి మహాలక్ష్మి, మౌనిక, సరస్వతి, సిపిఎం మండల కార్యదర్శి కూసంపూడి సుబ్బరాజు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల ప్రసాద్, కార్యకర్తలు ఆదిలక్ష్మి, కుమారి, భాగ్యలక్ష్మి, లక్ష్మి, శాంతి, భవాని పాల్గొన్నారు.


పాలకొల్లు : అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెకు టిడిపి, జనసేన నేతలు మద్దతు తెలిపారు. శిబిరం వద్దకు జనసేన నేత ఉన్నమట్ల ప్రేమ్‌కుమార్, టిడిపి నేతలు పెచ్చెట్టి బాబు, జివి, కొండేటి జీవరత్నం, దొరబాబు వచ్చి ఆందోళనకు మద్దతు తెలిపారు.

పోడూరు : పోడూరులో అంగన్వాడీల దీక్షలకు టిడిపి నరసాపురం పార్లమెంట్ మహిళ అధ్యక్షురాలు డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి సందర్శించి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కౌన్సిల్ సభ్యులు పిల్లి ప్రసాద్, ప్రాజెక్ట్ లీడర్ పీతల రాజమణి, బి.వెంకటరావు, రాయుడు కుమారి, జె.ఉమాదేవి పాల్గొన్నారు.

మొగల్తూరు : సిఎం జగన్ అంగన్‌వాడీల పట్ల నిరంకుశ ధోరణితో వ్యవహరిస్తున్నారని టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు విమర్శించారు. సమ్మె శిబిరాన్ని టిడిపి నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. అంగన్‌వాడీలకు టిడిపి అండగా ఉంటుందన్నారు. ఆయనతో పాటు టిడిపి మండల శాఖ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు, బస్వాని ఏడుకొండలు, పాల రాంబాబు, గోపాలం, పంపన భగవాన్ తెలిపారు.

వీరవాసరం : వీరవాసరంలో అంగన్‌వాడీల ఆందోళన తీవ్రతరం చేశారు. సమస్యలు పరిష్కరించేవరకూ సమ్మె శిబిరాల్లోనే ఉండి నిరసన కొనసాగిస్తామన్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు మాట్లా డారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, వెంకటలక్ష్మి, సత్యవతి, శాంతికుమారి, అన్నపూర్ణ, నాగపార్వతి వహించారు.

ఆకివీడు : పట్టణంలోని ఐదు సచివాలయాల పరిధిలోని అంగన్‌వాడీలు ఆయా సచివాలయ అధికారులకు విజ్ఞాపన పత్రాలు అందించారు. పట్టణంలో ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు రెండు బృందాలుగా విడిపోయారు. పట్టణంలో రెండు దిక్కుల్లో కార్యాలయం ఉండగా ఒక బృందం మూడు కార్యాలయాలకు మరో బందం రెండు కార్యాలయాలకు వెళ్లి విజ్ఞాపన చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కనకదుర్గ, కృష్ణకుమారి, సీతామహాలక్ష్మి దుర్గాదేవి పాల్గొన్నారు.


పాలకోడేరులో...

నరసాపురం టౌన్ : స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో సమ్మె శిబిరం వద్ద సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకులు ఎ.నీలిమ, జి.రాజేశ్వరి, జి.శ్రీలక్ష్మి, ఎస్.ఉమాకృష్ణకుమారి, రజిని, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పెనుగొండ : సచివాలయ ఉద్యోగ సోదరులు కూడా అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు ఇవ్వాలని కోరుతూ పెనుగొండ వడలి, సిద్ధాంతం, సెక్టార్లలో ఉన్న సచివాలయ ఉద్యోగులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీల లీడర్ పీడీ పరమేశ్వరి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షుడు నాగిశెట్టి గంగారావు, అంగన్వాడీలు హైమా, నాగలక్ష్మి, ఉషశ్రీ పాల్గొన్నారు.

పాలకోడేరు : పాలకోడేరులో అంగన్వాడీలు చిటికెలు వేసి వినూత్నంగా నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి సమస్యలు పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సిఐటియు మండల నాయకులు లారెన్స్‌కుమారి, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు శేషాపు ఆశ్రయ సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు విజయలక్ష్మి, విమల కుమారి పాల్గొన్నాం




నరసాపురంలో...

రైతుల ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలి

జెసి రామ్‌సుందర్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం


మాట్లాడుతున్న జెసి

రైతుల ప్రయోజనాలకు అధికారులు మొదటి ప్రాధాన్యతను ఇవ్వాలని జిల్లా జాయింటు కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో శనివారం ఖరీఫ్ 2023-24 పంట కాలానికి సంబంధించి ధాన్యం కొనుగోలు ప్రక్రియ, రైసు మిల్లుల నుంచి రైతు భరోసా కేంద్రానికి పంపాల్సిన గోనెసంచులపై సంబంధిత అధికారులతో జిల్లా జాయింటు కలెక్టర్ సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఆచంట, పాలకొల్లు, పెనుమంట్ర, పోడూరు, యలమంచిలి మండలాల రైతు భరోసా కేంద్రాలకు ధాన్యం పెద్ద మొత్తంలో వస్తున్న ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. గోనె సంచుల కొరత రాకుండా ప్రతి రైతు భరోసా కేంద్రంలో తగినన్ని నిల్వలు పెట్టుకోవాలన్నారు. జిల్లాలో ఖరీఫ్ పంటకు సంబంధించి 4.21 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రాథమిక అంచనా వేశామన్నారు. ఇప్పటివరకు 3.62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం 261 ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై జిల్లా మేనేజరు టి.శివరామప్రసాద్, డిఎస్ఒ ఎన్.సరోజ, జిల్లా వ్యవసాయ శాఖాధికారి వెంకటేశ్వరరావు, ఎఎస్ఒ ఎం. రవి శంకర్, జిల్లా కోపరేటివ్ కార్యాలయం సూపరింటెండెంట్ టిఎస్‌విఎస్ హనుమంతరావు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రాను విజయవంతం చేయండి

జనవరి పదో తేదీ నుంచి జరిగే మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేయలని జెసి ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై జిల్లా, నియోజకవర్గాల స్థాయి అధికారులతో జిల్లా జాయింటు కలెక్టరు సమీక్ష సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. సిఎం జగన్ శుక్రవారం భీమవరం పర్యటనలో భాగంగా మాట్లాడుతూ జిల్లాలో ఆడుదాం ఆంధ్ర రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని ప్రస్తావించరన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి, డిఎల్‌డిఒ ఎవి.అప్పారావు, గేమ్స్ ఫెడరేషన్ కోచ్ మల్లేశ్వరరావు, చీఫ్ కోచ్ డాక్టర్ ఎం.దుర్గారావు పాల్గొన్నారు.

భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూ హక్కు చట్టాన్ని వ్యతిరేకిస్తూ భీమవరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన లాయర్ల నిరసన దీక్షకు పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్రమించుకున్న భూములను ఈ చట్టం ద్వారా తమ అధికరణ అడ్డుపెట్టుకొని అధికారులతో సొంతం చేసుకోవాలని చూస్తుందన్నారు. ఈ భూ హక్కు చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రంగవల్లుల పోటీలు

ప్రజాశక్తి - మొగల్తూరు

వివేక ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులకు రంగవల్లుల పోటీలను నిర్వహించారు. పాఠశాల ఆవరణలో శనివారం కరస్పాండెంట్, సెక్రటరీ యు.గీతారాంబాబు పర్యవేక్షణలో నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. రంగవల్లుల పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులను అందించారు.

'పవన్‌పై విమర్శలు తగవు'

ప్రజాశక్తి - ఉండి

పవన్‌కల్యాణ్‌పై విమర్శలు తగవని జనసేన పార్టీ ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు అన్నారు. మండలంలోని పాములపర్రులో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సిఎం జగన్ తాను చేసిన అభివృద్ధి కార్యక్రమాలను చెప్పలేక ప్రతిపక్ష నాయకులపై విమర్శలు చేస్తున్నారన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో సుమారు 85 శాతం హామీలను నెరవేర్చకుండా తమ నాయకులను గడపగడపకు పంపించి ప్రజలను తమ పార్టీకి ఓటు వేయకపోతే సంక్షేమ పథకాలు ఆగిపోతాయని బెదిరించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు, టిడిపి, జనసేన నేతలు పాల్గొన్నారు.

'హామీల అమల్లో వైసిపి విఫలం'

ప్రజాశక్తి - ఆచంట

నవరత్నాల మేనిఫెస్టోలో జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీల అమలులో 85 శాతం నవరత్నాలు నవ మోసాలుగా మారాయని టిడిపి మండల అధ్యక్షులు కేతా మీరయ్య అన్నారు. స్థానిక రైతు సంఘం కార్యాలయంలో జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలు 85 శాతం ఫెయిల్ అయినట్లు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మీరయ్య మాట్లాడుతూ బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ సబ్‌ప్లాన్ నిధులు రూ.1.14 లక్షల కోట్లు దారి మళ్లించారన్నారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బాబు రాజేంద్రప్రసాద్, కేతా మురళి, గణపతి నీడి రాంబాబు, తమ్మినీడి ప్రసాద్, చిలుకూరి సీతారాం, ఏడిద శ్రీనివాస్ పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ఆచంట (పెనుమంట్ర)

చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మార్టేరుకు చెందిన జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు అల్లాడ సూర్యభాస్కరరావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన మార్టేరులో విలేకర్లతో మాట్లాడుతూ చేనేత మగ్గాల బ్యాంకు రుణాలు, మర మగ్గాల బ్యాంకు రుణాలు పూర్తిగా మాఫీ చేయాలని, చేనేత ఉప కులాలన్ని కలిపి చేనేత కులంగా జిఒ ఇచ్చి అమలు చేయాలని, పెరిగిన ముడి పట్టు, నూలు, జరి, రేట్లను క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వమే 50 శాతం రాయితీతో గ్రామ వార్డు సచివాలయాల ద్వారా నేతన్నకు అందించాలని డిమాండ్ చేశారు. ప్రతి నియోజకవర్గంలో నేత బజార్లు ఏర్పాటు చేసి మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని, ఆత్మహత్య చేసుకున్న ప్రతి చేనేత కార్మికుని కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, 45 ఏళ్లు నిండిన ప్రతి చేనేత కార్మికునికి పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. చేనేత ఉత్పత్తుల పైన 0 శాతం జిఎస్‌టి వర్తింపచేయాలనీ, నేతకార్మికుల పిల్లలను ఒకటో తరగతి నుంచి పీజీ వరకు ప్రభుత్వమే ఫీజు లేకుండా చదివించాలని కోరారు.

విద్యుత్ రాయితీ టిడిపితోనే సాధ్యం


ప్రజాశక్తి - ఉండి

ఆక్వా రైతులకు విద్యుత్ రాయితీ ఇవ్వాలంటే టిడిపితోనే సాధ్యపడుతుందని ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు అన్నారు. మండలంలోని పాములపర్రులో నిర్వహించిన ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్ రెండు రూపాయలకే ఇవ్వగా సిఎం జగన్ నాటి పాదయాత్రలో ఆక్వా రైతులకు యూనిట్ 1.50 పైసలుగా ఇస్తానని మాట ఇచ్చి మడమ తిప్పారన్నారు. తెలుగుదేశం, జనసేన పార్టీ ఉమ్మడిగా అధికారంలోకి వస్తే ఆక్వా రైతులకు విద్యుత్ రాయితీ ఇచ్చి ఫీడ్ కంపెనీలతో మాట్లాడి ధరలు తగ్గించే విధంగా చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, ఎంపిటిసి సభ్యులు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు యడవెల్లి వెంకటేశ్వరరావు, టిడిపి మండలాధ్యక్షులు కరిమెరక నాగరాజు, గ్రామ పార్టీ అధ్యక్షులు కేసన యాదగిరి, నాయకులు జుత్తిగ శ్రీనివాస్, కిన్నెర వెంకన్న, మంతెన సాయిలచ్చిరాజు, గురుగుబిల్లి సత్యనారాయణ, కోమటి నరేంద్రబాబు, మజ్జి కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

తూతూమంత్రంగా నగర పంచాయతీ పాలకవర్గ సమావేశం

ప్రజాశక్తి - ఆకివీడు

పాలకవర్గ చైర్ పర్సన్ జామి హైమావతి అధ్యక్షతన శనివారం మధ్యాహ్నం నగర పంచాయతీ పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నాలుగు అజెండా అంశాలు ఉన్నాయని మేనేజర్ వెంకటేశ్వరరావు మూడున్నర నిమిషాల్లో చదివి వినిపించారు. ఆ వెంటనే ప్రతిపక్ష టిడిపి జనసేన సభ్యులు లేచి తమ వార్డుల్లో డ్రెయినేజీ శానిటేషన్ సమస్య విపరీతంగా పెరిగిపోయిందని, తాగునీరు కుళాయిల్లో అందటం లేదని సమస్యను ప్రస్తావించారు. అజెండా అంశాలు అంగీకారం పొందినట్లు చైర్ పర్సన్ ప్రకటించారు. వెంటనే సమావేశం ముగిసిందని ప్రకటించారు. గతంలో 30 నుంచి 40 నిమిషాల పాటు జరిగిన సమావేశాలు ఉన్నాయి కానీ 15 నిమిషాల కంటే తక్కువ సమయంలో సమావేశం ముగియటం ఇదే మొదటిసారి.


సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఆచంట

సిఎం జగన్ కుల మతాలకు అతీతంగా అందరికీ సమన్యాయం చేస్తూ తనదైన శైలిలో ముందుకు వెళ్తున్నారని ఎంఎల్‌ఎ శ్రీరంగనాథరాజు అన్నారు. మండలంలోని వల్లూరులో నూతనంగా నిర్మిస్తున్న డ్రెయినేజీ పనులను శనివారం పరిశీలించారు. అనంతరం మహిళలతో మాట్లాడారు. అన్ని గ్రామాల్లో డ్రెయినేజీ నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య, సొసైటీ అధ్యక్షులు వీర వెంకట సత్యనారాయణ, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

'వైసిపి హయాంలో రాష్ట్రం అప్పులపాలు'

ప్రజాశక్తి- తణుకు

సిఎం జగన్ రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్ అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 85 శాతం ఫెయిల్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నాలుగున్నర సంవత్సరాల కాలంలో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారన్నారు. ఇంటి పన్ను, కరెంట్ ఛార్జీలు నిత్యావసర వస్తువుల ధరలతో ప్రజల జీవన విధానం భారంగా మారిందని చెప్పారు. రాష్ట్రం అభివద్ధి చెందాలంటే అది చంద్రబాబు వల్లే సాధ్యమవుతుందన్నారు. ఈ సమావేశంలో నరసాపురం పార్లమెంట్ జిల్లా ఉపాధ్యక్షులు బసవ రామకృష్ణ, గుబ్బల శ్రీనివాస్, రాధాకృష్ణ, మారుతీరావు, రాము పాల్గొన్నారు.


పుట్టినరోజు వేడుకల్లో గోపీ

ఘనంగా గోపీ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - పాలకొల్లు

వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ పుట్టినరోజు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి నియోజకవర్గ కార్యాలయాన్ని ప్రారంభించారు. గోపీ దంపతులను నియోజకవర్గంలోని వైసిపి నేతలు, కార్యకర్తలు పూలమాలలతో సత్కరించారు. ప్రెస్‌క్లబ్ సభ్యులు ఆయనను అభినందించారు. వైసిపి నేతలు యడ్ల తాతాజీ, ఉనికిల శ్రీనివాస్, మామిడి బాబు, ఛాంబర్ అధ్యక్షులు కారుమూరి నరసింహారావు, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు విస్సకోట వెంకటరమణ, కార్యదర్శి ఎంఎన్‌వి.సాంబశివరావు, కోశాధికారి తోట రాంబాబు, ఎపియుడబ్ల్యుజె జిల్లా ఉపాధ్యక్షులు పిటి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'వైసిపి పాలనలో ప్రజలకు ఇబ్బందులు'

ప్రజాశక్తి - మొగల్తూరు

వైసిపి ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరు రామరాజు అన్నారు. పార్టీ మొగల్తూరు మండల శాఖ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయం చేయాలా లేదా తెలియకుండా అన్నదాతలు ఆందోళన చెందుతున్నారన్నారు. ఉద్యోగులకు సిపిఎస్ రద్దు చేస్తానని హామీ ఇచ్చి మోసం చేశారని విమర్శించారు. ఎస్‌సి సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పట్టించి అభివృద్ధికి వారిని దూరం చేశారన్నారు. బిసిలకు గతంలో ఉన్న 34 శాతం రిజర్వేషన్ 24 శాతానికి కుదించారన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను అప్పుల్లో అగ్రస్థానంలో నిలిపిన ఘనత వైసిపి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బస్వాని ఏడుకొండలు, పాల రాంబాబు, గోపాలం, పంపన భగవాన్ పాల్గొన్నారు.

టిడిపిలోకి తోట రాము

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని పాములపర్రు గ్రామానికి చెందిన తోట రాము శనివారం ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామారాజు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ రామరాజు మాట్లాడుతూ పాములపర్రు గ్రామానికి చెందిన సామాజికవేత్త తోట రాము పార్టీలో చేరడం శుభ పరిణామమన్నారు. 2004 సంవత్సరం నుంచి సుమారు 80 మంది వృద్ధులకు, వితంతువులకు నెలకు రూ.200 చొప్పన తన సొంత సొమ్మును పింఛన్ రూపంలో ఇచ్చారన్నారు. పండుగ సమయాల్లో వృద్ధులకు, వితంతువులకు దుప్పట్లు పండ్లు ఇవ్వడమే కాకుండా కష్టాల్లో ఉన్న ప్రతి కుటుంబానికి ఆర్థికంగా తన వంతు సహకారం అందించడం గర్వకారణమన్నారు. అటువంటి తోట రామును ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకుని తోటి వారికి సహకారం అందించాలని ఎంఎల్‌ఎ మంతెన రామరాజు సూచించారు. తోట రాముతో పాటు సుమారు 40 మంది కార్యకర్తలు ఎంఎల్‌ఎ రామరాజు సమక్షంలో టిడిపిలో చేరారు.